క్లుప్తంగా

'అందరం పుస్తకాలను చదివేద్దాం'



తెర్లాం హైస్కూల్‌లో అందరం పుస్తకాలను చదివేద్దాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ త్రినాధరావు

తెర్లాం: వేసవి సెలవుల్లో విద్యార్థులంతా అనేక రకాల పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'అందరం పుస్తకాలను చదివేద్దాం' అనే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటపాటలపై ఎక్కువగా దృష్టిసారించకుండా పుస్తకాలు చదవడంపై కూడా శ్రద్ధ కనబరచాలన్నారు. గ్రామాల్లో కూడా మొబైల్ లైబ్రరీలు ఏర్పాటు చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వల వేలం



పోలీసుల సమక్షంలో వేలంపాట నిర్వహిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ నాగావళి నదీతీరంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక పోగులను మంగళవారం వేలం వేశారు. తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, ఏఎస్‌ఐ రాజారావు సమక్షంలో నిర్వహించిన ఈ వేలంలో సంకిలికి చెందిన నక్క గురున్నాయుడు రూ.6 వేలకు ఇసుకను దక్కించుకున్నారు. జనవరి 20వ తేదీన ఈ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు వీఆర్‌ఓ గోపాలనాయుడు తెలిపారు.

విజయరాంపురంలో గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్

తెర్లాం: మండలంలోని విజయరాంపురంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని సర్పంచ్ సర్పంచ్ బూరి మధుసూదనరావు కోరారు. గ్రామంలోని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామ తెలిపారు. గ్రామ ప్రగతికి గ్రామస్తులు, అధికారుల సహాయ సహకారాలు అవసరమన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు

తెర్లాం: వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ ఆర్.రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన ఆయన వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు గొడుగు, వాటర్‌బాటిల్ వెంట తీసుకురావాలన్నారు. పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారందరూ ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్, సీఐ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

టోపీలు, రుమాళ్లు అందజేత



పోలీసులకు టోపీలు అందజేస్తున్న సీఐ

బొబ్బిలి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని పోలీసులకు వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్ భాషా, మున్సిపల్ కో–ఆపరేషన్ మెంబర్ రియాజ్‌ఖాన్ సమకూర్చిన టోపీలు, రుమాళ్లు మంగళవారం అందజేశారు. వేసవి నేపథ్యంలో రోడ్లపై ఎండలో విధులు నిర్వహించే సిబ్బంది వడదెబ్బ బారినపడకుండా వీటిని ఆయా నేతలు వితరణ చేసినట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు జ్ఞానప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఛైర్మన్ పరిశీలన

బొబ్బిలి: దాడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో సిరిమానోత్సవం జరిగే ప్రదేశాలు, సిరిమాను తయారీని మున్సిపల్ ఛైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు మంగళవారం పరిశీలించారు. ఉత్సవాల్లో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. పారిశుద్ధ్యంపై కూడా ప్రత్యేక దృష్టిసారించాలని, పండగ రోజుల్లో ప్రజలకు అందుబాటులో తాగునీరు ఉంచాలన్నారు.

జనం నినాదం జగన్

బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్ –మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఎక్కడికి వెళ్లినా ప్రజలు జై జగన్.. జై వైఎస్సార్ సీపీ నినాదాలతో పార్టీ నేతలకు ఘనస్వాగతం పలుకుతున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గతంలోని టీడీపీ, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనలో ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఇదే ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: తెలగవీధిలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల



రేగిడి: జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎంపీపీ అప్పలనరసమ్మ, సర్పంచ్ వెంకటనాయుడు



బొబ్బిలి: మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లతో తారకరామ కాలనీ వాసులు



రాజాం: పొగిరిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీరంగంనాయుడు



రామభద్రపురం: కొండకెంగువలో ప్రచారంలో వైస్ ఎంపీపీ ప్రసాద్



సంతకవిటి: మా నమ్మకం నువ్వే జగన్ అని స్టిక్కర్లు చూపిస్తున్న కొండగూడేం గ్రామస్తులు



బొబ్బిలి: పాతబొబ్బిలిలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ పెదరాములు



తెర్లాం:సోమిదవలసలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ, గృహసారథులు, సచివాలయ



బాడంగి: వాడాడలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం



బాడంగి: కోడూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ ప్రచారం

మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గొల్లపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రజలకు ఏ విధమైన కష్టమొచ్చినా తానున్నాన్న భరోసా కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు) తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



గ్యాస్ విక్రయ కేంద్రంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజాం సిటీ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక బొబ్బిలి రోడ్డులోని లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీతో పాటు పలు పెట్రోల్ బంకుల ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫైర్ ఎస్‌ఐ టీఎస్‌ఎస్ జనార్ధనరావు వివరించారు. గ్యాస్ లీకేజీ జరగకుండా, గ్యాస్ లీకేజీ ద్వారా చెలరేగే మంటలను అదుపు చేయడాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



రాజాం: గడిముడిదాం సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సులోచన

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీపీ లావేటి సులోచన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్రంలో అన్ని రకాల ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లావేటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు మంగళవారం పరిశీలించారు. కొత్తగా ఆధార్ కార్డుల నమోదు, పాత ఆధార్ కార్డులోని వివరాల్లో తప్పుల సవరణ చేపడతారని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఖరీఫ్ సీజన్‌కు అందుబాటులో ఎరువులు



చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఈఓపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. చెత్త సేకరించిన విధానంతో పాటు కేంద్రంలో సేంద్రియ ఎరువు తయారీపై ఆరాతీశారు. అనంతరం ఇక్కడ తయారు చేసే ఎరువును రాయితీపై రైతులకు అందించి, పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ఘనంగా అసిరితల్లి సంబరాలు

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామంలో అసిరితల్లి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మంగరాజు కుటుంబ సభ్యులు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

మద్యంసీసాలతో వ్యక్తి అరెస్ట్

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్లాన సాయిబాబా అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి, ఎనిమిది మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. ఎటువంటి అనుమతి లేకుండా మద్యం అమ్మినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమన్వయంతో పనిచేయాలి

రాజాం సిటీ: మండల అభివృద్ధికి మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి సుధాకర్ కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. ఉపాధి పనులు చక్కగా చేయించాలని, పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేలా చూడాలన్నారు. అలాగే పలుచోట్ల జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

23న ప్రవేశ పరీక్ష

రేగిడి/బాడంగి: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఈ నెల 23వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌లు బి.బుచ్చిరాజు, బి.వి.పూర్ణచంద్రరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్షకు గంట ముందు హాజరు కావాలని, హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, పెన్ను, పెన్సిల్, రబ్బరు వెంట తీసుకురావాలని తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- హౌసింగ్ ఈఈ వి.శ్రీనివాస్



ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షిస్తున్న హౌసింగ్ ఈఈ శ్రీనివాస్

రామభద్రపురం: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ వి.శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో రామభద్రపురం, బాడంగి మండలాలకు చెందిన డీఈలతో పాటు రామభద్రపురం మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల స్థితిగతులపై సమీక్షించారు. మండలాల వారీగా ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఎన్ని నిర్మాణాలు పూర్తి కావస్తున్నవి, ఎన్ని నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సొంతిల్లు లేని వారు ఉండకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రతీ పేదవాని సొంతింటి కల నెరవేర్చే బాధ్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని, అందుకే అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేశారన్నారు. డివిజన్‌లో జగనన్న లే–అవుట్‌లతో పాటు సొంత స్థలాల్లో 18,759 మంజూరు కాగా, 8,130 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 406 శ్లాబులు పూర్తి కాగా, శ్లాబు స్థాయిలో 1232, బేస్‌మెంట్ స్థాయిలో 4,133, పునాది దశలో 3468 ఇళ్లు ఉన్నాయన్నారు. మరో 1375 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. ఈ నెలాఖరులోగా ప్రారంభం కాని నిర్మాణాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణాలు పూర్తి చేస్తున్న వారికి బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నామని, మార్చి 31వ తేదీ వరకు పూర్తి బకాయిలు చెల్లించామన్నారు. ఇళ్ల నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారులనికి రూ.1.80 లక్షల చొప్పున్న ఆర్థికసాయంతో పాటు బ్యాంకుల నుంచి రూ.35 వేల రుణం అందిస్తోందని వీటిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణాలను వేగవంతం చేయించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈలు రత్నాకర్, పి.అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడులు వేస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్...



రామభద్రపురంలో ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: వ్యాన్‌లలో అధిక లోడులు వేయకూడదని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించొద్దని ఎస్‌ఐ బి.సురేంద్రనాయుడు హెచ్చరించారు. మండల కేంద్రం మీదుగా లగేజీ వాహనదారులు అధిక లోడులతో రాకపోకలు సాగించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇలా అయితే ఎలా అనే శీర్షికన ఈ నెల 17వ తేదీన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన ఎస్‌ఐ సురేంద్రనాయుడు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ఆటో డ్రైవర్లతో సమావేశమై ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదని సూచించారు. వాహనాలు నడపడంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పని సరిగా దగ్గర పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి ఆటోలను నడపకూడదన్నారు. పెండింగ్ చలానాలు ఏవైనా ఉంటే వెంటనే చెల్లించా

మతోన్మాద బీజేపీని సాగనంపండి



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

బొబ్బిలి: మతోన్మాద బీజేపీని అధికారంలో నుంచి దించి, ఇంటికి సాగనంపాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోట అప్పన్న, ఎస్.గోపాలం, మునకాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా స్థానిక పట్టణంలోని తాండ్రపాపారాయ జంక్షన్‌లో ప్రచార భేరి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేంద్రంలోని మోదీ సర్కారు పాలనపై విరుచుకుపడ్డారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో కలిసి, మత విద్వేషాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. మళ్లీ మళ్లీ అధికారంలోకి రావడం కోసం ఎన్నో అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు. ఒక్కోసారి దేశ రక్షణ పేరిట సైనిక చర్యకు పాల్పడి దానిని వారికి అనుకూలంగా మార్చుకుని, దిగజారుడు రాజకీయానికి పాల్పడుతున్నారన్నారు. నోట్ల రద్దు దగ్గర నుంచి జీఎస్టీ, వ్యవసాయ చట్టాలు, కార్మిక వ్యతిరేక విధానాలు, నిత్యావసరాలు, ఇంధన ధరల పెంపు వరకు అన్నీ ప్రజావ్యతిరేక నిర్ణయాలేనన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి మరో అవకాశం ఇస్తే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లేనన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పంచాయతీల అభివృద్ధి



పంచాయతీ అభివృద్ధికి సూచనలు చేస్తున్న పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు

రాజాం: అందరి సహాయ, సహకారాలతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మంగళవారం మండలంలోని గడిముడిదాం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో పంచాయతీ అభివృద్ధికి ఎంపీపీ లావేటి సులోచన, సర్పంచ్ లావేటి రమాదేవి, పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు కలిసి పలు సలహాలు, సూచనలు చేశారు. గ్రామంలోని సమస్యలు పాలక మండలి దృష్టికి వస్తే, పరిష్కరించే అవకాశం ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు. అధికారులు, గ్రామస్తులు కలిసి పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలి



రేగిడి: ఆమదాలవలసలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ హరనాథరావు



సంతకవిటి: ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులు

రేగిడి: వేసవి నేపథ్యంలో ఉపాధి హామీ పనులకు వచ్చే వారంతా వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని వెంకమ్మపేట, తునివాడ, ఆమదాలవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం పనుల్లో నాణ్యత ఉండాలని, నిర్దేశిత కొలతల్లో పనులు చేపట్టాలని వేతనదారులకు ఆయన సూచించారు. పనులకు వచ్చే వారికి మాత్రమే మస్తరు వేయాలన్నారు.

సంతకవిటి: మండలంలోని సురవరం, మండాకురిటి, మిర్తివలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో మాత్రమే పనులకు వెళ్లాలని తెలిపారు. పని ప్రదేశంలో టెంట్లు, వాటర్‌బాటిల్, ప్రథమ చికిత్సా కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.



వంగరలో వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఏఎన్‌ఎం విశాలాక్షి

వంగర: మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. వేసవి నేపథ్యంలో ఉపశమనం పొందేందుకు వీటిని పంపిణీ చేసినట్లు ఏఎన్‌ఎం విశాలాక్షి తెలిపారు.

వంటకాలు రుచి, శుచితో ఉండాలి



సంతకవిటి: విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాధాచారి



వంగర: విద్యార్థులకు అందజేస్తున్న రాగిజావ పరిశీలిస్తున్న డీటీ గోవిందరావు

సంతకవిటి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు తప్పనిసరిగా రుచి, శుచి కలిగి ఉండాలని ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి, సర్పంచ్ బి.జ్యోతీశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని మండాకురిటి గ్రామ పాఠశాలను సందర్శించిన వారు అక్కడి విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వంటకాలు వండిపెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని పటువర్ధనం గ్రామ పాఠశాలను సివిల్ సప్లయి డీటీ బలివాడ గోవిందరావు మంగళవారం సందర్శించి, విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు.